క్లుప్తంగా

పేదలకు అన్నదానం



పెదకూరపాడు: అభయాంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకొని గురువారం పెదకూరపాడులో ఏర్పాటు చేసిన అన్నదానంలో భోజనం మిగిలింది. ఈ విషయాన్ని జన చైతన్య సమితి ప్రతినిధులకు నిర్వాహకుడు కొర్లకుంట శ్రీనివాసరావు సమాచారం ఇచ్చారు. జన చైతన్య సమితి బృంద ప్రతినిధులు భోజనాన్ని సేకరించి ఆటోలో తీసుకువెళ్లి మండలంలోని 75 తాళ్లూరు శాంతి కాలనీలో పంపిణీ చేశారు. జన చైతన్య సమితి ప్రతినిధి అన్నవరపు స్టాలిన్ బాబు మాట్లాడుతూ ఏ శుభకార్యంలోనైనా ఆహారం మిగిలిపోతే తమకు సమాచారం ఇస్తే దాన్ని తీసుకువెళ్లి పేదలకు పెడతామని చెప్పారు. అన్నార్తుల ఆకలి తీర్చే ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుడిపూడి అఖిల్, అన్నవరపు సిద్ధు, గంధం వీర్లంక, సయ్యద్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

మేకలకు ఆహారం.. పచ్చదనం



సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తుంటే.. సత్తెనపల్లిలో మాత్రం పచ్చదనం కాస్తా మేకలకు, ఆవులకు ఆహారంగా మారుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారిలో సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన మొక్కలకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఆవులు, మేకలు మేస్తున్నాయి. సెంట్రల్ డివైడర్ మొత్తం ఓ పక్క ప్రచార బోర్డులతో నిండిపోగా.. మరోవైపు మేకలు, ఆవులు మేయడంతో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డివైడర్ పై ప్రచార బోర్డులను తొలగించి, పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: మద్యం వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. విజయ్ కుమార్ తెలిపారు. మద్యం షాపుల సమయపాలనపై శుక్రవారం పెట్రోలింగ్, ఎమ్మార్పీ ధరలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి టౌన్, రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాల పరిధిలోని ప్రైవేటు మద్యం షాపుల నిర్వాహకులు సమయపాలన పాటించాలని చెప్పారు. ఎమ్మార్పీకి మించి అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ కె. నాగలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

నేడు చందనోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయంలో ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం స్వామికి చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకోవాలని వారు కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో శని, ఆదివారాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ శివకోటిరెడ్డి తెలిపారు. నూతనంగా ఊటుకూరు నుంచి లైను వేస్తున్న సందర్భంగా సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం పాలైన సంఘటన గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో చిలకలూరిపేట బ్యాంక్ ఆఫ్ బరోడా సెంటర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన జగ్గరపు సంజయ్ (21) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. గురువారం పగలు వివాహ వేడుకకు హాజరై రాత్రి చిలకలూరిపేట జాతీయ రహదారిపై బ్యాంక్ ఆఫ్ బరోడా జంక్షన్‌లో వాహనాన్ని తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఎదిగొచ్చిన కుమారుడు మృతి చెందాడన్న సమాచారంతో తల్లిదండ్రులు కోటేశ్వరరావు, ధనలక్ష్మి తల్లడిల్లారు. గత కొన్నేళ్లుగా కోటేశ్వరరావు పెరాలసిస్ వ్యాధితో బాధపడుతుండగా, తల్లి ధనలక్ష్మి ఇంట్లోనే కుట్టుమిషన్ కుడుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. మృతుడు సంజయ్ ఇంటర్ పూర్తయ్యాక ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. సంజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించారు.

సత్తెనపల్లి కాదు చెత్తపల్లి



పట్టణంలోని 12వ వార్డులో గల హిందూ శ్మశానవాటిక వద్ద చెత్త నిల్వలు



పట్టణంలోని కోర్టు ఎదుట మురుగు నీల్వలు

- పట్టణంలో పడకేసిన పారిశుద్ధ్యం
- పలుచోట్ల నిలిచిన వర్షపు నీరు
- భరించలేని దుర్వాసన

సత్తెనపల్లి: పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగు కాలువల్లో పూడిక తీయటానికి వీలు లేకుండా కప్పేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు మురుగు కాలువలు పొంగి పొర్లి మురుగంతా రోడ్ల మీదకు చేరింది. మురుగునీరు నిల్వ వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్లపై రాకపోకలు సాగించే పాదచారులు ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కోర్టు వద్ద మురుగు నీటి నిల్వలు పేరుకు పోయాయి. దీనికి తోడు చెత్త నిల్వ పాయింట్లు వద్ద చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని హిందూ శ్మశానవాటిక వద్ద చెత్త నిల్వలు పేరుకు పోయాయి. అక్కడే ఆవులు, కుక్కలు తిరుగుతూ చెత్తాచెదారాన్ని రోడ్లపైకి చేర వేయడంతో మరింత దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

సామాజిక ఎదుగుదలకు విద్య అవసరం

కుందురువారిపాలెం(ముప్పాళ్ల): సామాజిక ఎదుగుదలకు, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు విద్య చాలా అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి చెప్పారు. ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ ముప్పాళ్ల సెక్టార్ పరిధిలోని కుందురువారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి విద్య సమాజంలో మెరుగైన జీవనం సాగించటానికి దోహదపడుతుందని తెలిపారు. ఓపెన్ స్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా సంరక్షురాలు జి.జయలక్ష్మి, ఏఎన్ఎం ఎం.శోభారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి. రాజ్యలక్ష్మి , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని రుద్రవరంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, మహిళా సంరక్షురాలు వి.సరితాదేవి, ఏఎన్ఎం ఎం.పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త సులోచన, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

పెదకూరపాడు: మండలంలోని బుస్సాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం మూడో విడతలో భాగంగా బాల్య వివాహాల వల్ల నష్టాలు, అనర్థాలు, గుడ్, బ్యాడ్ టచ్‌పై పెదకూరపాడు సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ మున్ని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు మనోధైర్యం కలిగి ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. బాలికలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా మెహందీ ద్వారా కిశోరి బాలికల చేతులపై స్లోగన్స్ రాసి, ఇంటింటికీ బాల్య వివాహాలు చేయవద్దని వినూత్న పద్ధతిలో ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కాకిరాల అనిత, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రెండు గ్రామాలలో కిశోర వికాశం

అచ్చంపేట: కిశోర వికాశం కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని తాడువాయి, అచ్చంపేట గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎస్.నరసమ్మ, సీహెచ్. జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై కిశోరి బాలికలకు అవగాహన

సత్తెనపల్లి: కౌమార దశలో బాలికలకు ఎదురయ్యే సమస్యలు, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు కిశోర వికాసం ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు ఏసీడీపీఓ టి.సంతోషకుమారి తెలిపారు. పట్టణంలోని 19వ వార్డు ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కిశోర వికాసంలో ఆమె మాట్లాడారు. వేసవి సెలవుల్లో కిశోర వికాసం పేరుతో బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా బాలికలలో ఆత్మస్థైర్యం పెంపొదించడమే లక్ష్యమన్నారు. ఈనెల 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి. ప్రమీల, మహిళా పోలీస్ గీతా వాణి, ఏఎన్ఎం డి.ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు

బెల్లంకొండ: విద్యతోనే వ్యక్తిగతంగా, సామాజికంగా ఎదుగుదలతో పాటు మంచి గుర్తింపు లభిస్తుందని ఐసీడీఎస్ మాచాయపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ చదువుకు దూరమైన బాలికల కోసం ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలలను అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. దూరవిద్య ద్వారా చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. స్కూల్ డ్రాప్ అవుట్స్‌కు ఆన్‌లైన్ కోర్సులు, నైపుణ్య శిక్షణ అందేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త భవాని, సిబ్బంది, కిశోరి బాలికలు పాల్గొన్నారు.



కుందురువారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది



పెదకూరపాడులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



సత్తెనపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ సంతోషకుమారి



గుడిపాడులో మాట్లాడుతున్న డీసీపీవో బిందు

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

గుడిపాడు(క్రోసూరు): బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు బిందు, ప్రశాంత్ తెలిపారు. మండలంలోని గుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సరళ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీపీవోలు మాట్లాడుతూ బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో క్రోసూరు సెక్టార్ సూపర్ వైజర్ మాధవి, 88 త్యాళ్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ మైమున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

- మండలంలోని నాగవరం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసంలో భాగంగా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

ప్రపంచానికి ఆదర్శనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశీర్వాదం తదితరులు

సత్తెనపల్లి: అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయుడని జై డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ నాయకుడు గుంటూరు ఆశీర్వాదం అన్నారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడిలో 16 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించే క్రమంలో శుక్రవారం స్లాబ్ నిర్మాణం చేపట్టారు. అంబేడ్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ, ప్రజా చైతన్య భారతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర అసాధారణమైందని తెలిపారు. ప్రజా చైతన్య భారతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు దూబగుంట్ల జానకీ రామారావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం పేద కుటుంబాలకు క్వింటా బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఏకుల రాజశేఖర్, సర్పంచ్ గుగ్గిలం అంకమ్మ, గ్రామ పెద్దలు పురం సుందరరావు, బిల్లా రవిబాబు, కాశిమాల విజయబాబు, పురం సుధాకర్, పురం పెద్ద ఆదాం, తురుమెళ్ల దావీదు, కాశిమాల ఏసోబు, కంచకర్ల బాలకృష్ణ, మాల మహానాడు అధ్యక్షుడు కంచకర్ల జోసెఫ్, 7వ వార్డు మెంబర్ తురిమెళ్ల కోటేశ్వరరావు, పురం మరిదాసు, పురం విద్యాసాగర్, కంచకర్ల భరత్, వీరయ్య పాల్గొన్నారు.

సేవా భూషణ్ అవార్డు గ్రహీత దాసుకు సన్మానం



దాసును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు గురువారం 'సేవా భూషణ్' అవార్డు గ్రహీత గార్లపాటి దాసును వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ దాసు ముున్ముందు మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు వెలది అప్పారావు, జెడ్పీటీసీ సభ్యురాలు జమీలా గఫూర్, ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, ఉపాధ్యక్షులు విప్పల వెంకట్రామిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, క్రోసూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలకా దాసయ్య, పార్టీ గ్రామ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా బీసీ నాయకులు కోనంకి గురునాథం, పందిటి వీరయ్య, షేక్ అల్లా బక్షు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు

1,008 మామిడి పండ్లతో అభిషేకం



విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయుడు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి జయంతి, కల్యాణ ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వెంకట అనంతాచార్యులు సుప్రభాత సేవలతో పూజలు ప్రారంభించారు. అనంతరం 1,008 చూత ఫలాలతో (మామిడి పండ్లతో) విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు చేసి స్వామికి నైవేద్యాలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం రాజుపాలెం గ్రామానికి చెందిన మహిళా బృందం కోలాటం ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా మొదటి మూడు రోజుల్లో అన్ని టికెట్ల ద్వారా రూ. 26,635, విరాళాల ద్వారా రూ.1,86,910 కలుపుకుని మొత్తం రూ. 2,13,545 ఆదాయం వచ్చినట్లు ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్ పాస్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్ అయిన యువత వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల వరకు ఉండాలని పేర్కొన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, భోజనం, వసతి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు. కోర్సులో భాగంగా ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

సత్తెనపల్లి: యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో వార్డు సచివాలయ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా శరీరం, మనసు, భావోద్వేగం, శక్తి స్థాయిపై పని చేస్తుందని తెలిపారు. యోగాంధ్ర-2025కు సంబంధించి వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే రిజిస్ట్రేషన్లు ఈనెల 25 సాయంత్రంలోపు పూర్తి చేయాలని ఆయన సూచించారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, ఇన్‌చార్జ్ మున్సిపల్ మేనేజర్ సుభాని పాల్గొన్నారు.

అసలే రద్దీ.. ఆపై ఆక్రమణలు !



అచ్చంపేట మెయిన్ రోడ్డులో ట్రాఫిక్



అమరావతి రోడ్డులో ఎస్‌బీఐ ముందు ద్విచక్ర వాహనాలు

- రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్
- బ్యాంకుల ముందు రోడ్ల పైనే ద్విచక్ర వాహనాలు నిలిపివేత
- ఆక్రమణలకు గురవుతున్న మెయిన్ రోడ్డు
- పట్టించుకోని అధికారులు

అచ్చంపేట: అచ్చంపేటలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఏ రోడ్డు చూసినా రద్దీగానే ఉంటోంది. మెయిన్ రోడ్డు మార్జిన్స్‌లో తోపుడు బండ్లపై వ్యాపారాలు సమస్యగా మారాయి. దీంతో ఆటోలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే వారికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు పైనే నిలబడుతున్నారు.బ్యాంకుల ముందు పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే ఖాతాదారులు వాహనాలను నిలుపుతున్నారు. సత్తెనపల్లి రోడ్డులో అంజనేయస్వామి విగ్రహం నుంచి పంచాయతీ ఆఫీసు వరకు, అమరావతి రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి కొఠారు సెంటరు వరకు ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

23 గ్రామాలకు సెంటర్

23 గ్రామ పంచాయతీల నుంచి అచ్చంపేటకు నిత్యం రెవిన్యూ, వ్యవసాయ, విద్యుత్ కార్యాలయాలకు, నిత్యావసర సరకుల కోసం దుకాణాలకు వచ్చిపోతుంటారు. ఇక్కడే నాలుగు బ్యాంకులు ఉండటంతో డ్వాక్రా మహిళా సంఘాలు పొదుపు మొత్తాలను బ్యాంకుల్లో వేసుకునేందుకు, రుణాలు పొందేందుకు అచ్చంపేట రావడం తప్పనిసరి అవుతోంది. వీరంతా ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు కూడా సమయాలను పాటించకపోవడంతో గంటల సేపు ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండాల్సి వస్తోంది.

రోడ్డు ఆక్రమణలతో సమస్య

ప్రధాన రోడ్డులో ఆక్రమణలు కూడా సమస్యగా మారింది. ఇళ్ల ముందు మెరకలు పోసుకోవడం, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునేవారికి అద్దెకు ఇవ్వడంతో సమస్యగా మారింది. గతంలో ఆక్రమణలను తొలగించినా మూడునాళ్ల ముచ్చటే అయింది. పోలీసు అధికారులు స్పందించి మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రేపు గణపవరంలో లింగధారుల సమ్మేళనం

నాదెండ్ల: గణపవరం శివనాగేంద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఈ నెల 25 ఆదివారం లింగధారి సర్వతో ముఖాభివృద్ధి సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా లింగధారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు స్టీరింగ్ కమిటీ సభ్యులు కొల్లిపర పూర్ణచంద్రరావు, సిద్ధాంజనేయ చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ఉమామహేశ్వర వ్రతం, ఆది జగద్గురువులు బసవాది జయంతి పూజా కార్యక్రమాలు, 11 గంటలకు విశిష్ట అతిథుల సందేశం, అనంతరం ప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు.

వచ్చే ఐదేళ్లలో రూ.100 కోట్ల రుణాలు

విశాఖపట్టణం కో ఆపరేటివ్ బ్యాంకు సభ్యుల మహాసభ నిర్వహణ



మాట్లాడుతున్న డైరెక్టర్ మూర్తి

నరసరావుపేట: రానున్న ఐదేళ్లలో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో రూ.100 కోట్లు రుణాలను అందజేయనున్నట్లు బ్యాంక్ డైరెక్టర్ జీవీ సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జీఎల్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన బ్యాంక్ సభ్యుల మహాసభకు బ్యాంక్ వైస్ చైర్మన్ రాఘవరావు అధ్యక్షత వహించారు. మూర్తి మాట్లాడుతూ నరసరావుపేట బ్రాంచ్ నుంచి ఇప్పటి వరకు రూ.5కోట్లు రుణాలను అందజేశామన్నారు. రూ.3.72కోట్లు డిపాజిట్లుగా వచ్చాయని తెలిపారు. ఒక పెద్ద సంస్థ రూ.2 కోట్లు డిపాజిట్ చేసిందని, అయితే ఈ బ్రాంచ్ పరిధిలో రూ.1.72 కోట్లు మాత్రమే డిపాజిట్ల రూపంలో సేకరించామన్నారు. 44 శాతం బంగారంపై రుణాలను నరసరావుపేట బ్రాంచ్ ద్వారా అందజేశామని చెప్పారు. డైలీ డిపాజిట్ల సేకరణ, రుణాల వసూళ్లు ఈ బ్రాంచ్ పరిధిలో సంతృప్తిగా ఉన్నాయన్నారు. ఇప్పటివరకు తమ బ్యాంకులో 1.11 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ ఆర్థిక ఏడాదిలో మొండిబకాయలను జీరోకు తీసుకురాగలిగామన్నారు. సహకార బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, టాస్క్ ఫోర్స్ అర్బన్ బ్యాంకుల ఏర్పాటులో ఆంజనేయులు కృషి శ్లాఘనీయమన్నారు. విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ రూ.1200కోట్లు ప్రభుత్వానికి పెట్టుబడి పెట్టడం జరిగిందన్నారు. దీనిపై నామమాత్రంగా ఆరు శాతం వడ్డీ వస్తుందన్నారు. ఈ ఏడాది మరో ఐదు నూతనంగా బ్రాంచ్‌లను ప్రారంభించామన్నారు. జోనల్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ మూర్తి, డైరెక్టర్లు ఆచార్య ఎస్.అంజయ్య, బ్రాంచ్ మేనేజర్ వీరవల్లి బంగారు బాబు పాల్గొన్నారు.

నేడు హనుమత్ జయంతి వేడుకలు

క్రోసూరు: స్థానిక దొడ్లేరు రోడ్డులో సిద్ధిపాలెం వద్ద గల అభయాంజనేస్వామి జయంతి వేడుకలు శనివారం వైభోపేతంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. స్వామికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు ఆశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పలు దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ

సత్తెనపల్లి: పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు కొలతలు శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాల్లో ఎమ్మార్పీకి మించి విక్రయిస్తున్నారని, ఒక దుకాణంలో ప్యాకింగ్‌పై చిరునామా, తేదీ, అడ్రస్ లేవని గుర్తించారు. మొత్తం నాలుగు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా షేక్ సైదా మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా చిరునామా, తయారీ తేదీ, గడువు ముగిసే తేదీని తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. మోసం చేశారని చేశారని గ్రహిస్తే తూనికలు, కొలతలు శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.